
సాక్షి బాపట్ల

బుధవారం । 15 । మే । 2024



19 నుంచి పోలేరమ్మ తల్లి జాతర

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వేమవరంలో కొలువైన పోలేరమ్మ తల్లి జాతర ఈ నెల 19, 26 తేదీలలో జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు.



మహాకాళేశ్వరా నమో

ఫిరంగిపురం: వేమవరం కోటి ఒక్కలింగాల క్షేత్రంలోని మరకత లింగానికి మంగళవారం భక్తులు పూజలు చేశారు. మహాకాళేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

22 నుంచి గుండి పార్వతి తిరునాళ్ల



భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ స్మశానవాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారి తిరునాళ్ల ఈ నెల 22, 23 తేదీలలో నిర్వహించనున్నట్లు కాపు సంఘం, నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు



నరసరావుపేటరూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. మంగళవారం స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎన్నికల పరిశీలకులు బూరే సర్వేశ్వరనరేంద్ర, శ్రీహరి ప్రతాప్‌సింగ షాహి లు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.


నరసరావుపేటలో 144 సెక్షన్ అమలు



నరసరావుపేటటౌన్: హింసాత్మక ఘటనల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వి.ఎస్.ఎన్.వర్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలపై పార్టీల జెండాలు పెట్టుకొని తిరగటం నిషేధమన్నారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టే విధంగా పాటలు, కవ్వింపు చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన కూడళ్లలో నలుగురికి మించి ఉండరాదన్నారు. జనం ఎక్కువగా ఒక ప్రాంతంలో గుమికూడితే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, మల్లికార్జునరావు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్ఐ పి.రాంబాబు మంగళవారం తెలిపారు. సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరిగిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకొని ప్రజలు ఎవరి ఇళ్లలో వారు ఉండాలన్నారు. నలుగురు అంతకన్నా ఎక్కువ మంది ప్రజలు రోడ్లపైకి గుంపుగా రాకూడదని అన్నారు.

సంతగుడిపాడులో పోలీసు కవాతు



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం పోలీసులు, బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల అనంతరం ఆ గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వచ్చే నెల 4 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రాజకీయపార్టీల నాయకులు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు సంయమనం పాటించాలన్నారు.

రెండు గ్రామాల్లో పోలీసు పికెట్

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, వేల్పూరు గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఆయా గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషనులో ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం జనసేన, కాంగ్రెసు పార్టీలకు చెందిన వారం దరూ పాత కక్షలు మనసులో పెట్టుకొని కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఇరు పార్టీలకు చెందిన వారిని చెదరగొట్టారన్నారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయన్నారు. ఎన్నికల సందర్భంగా అన్నీ పార్టీలకు చెందిన నాయకులు సంయమనం పాటించాలన్నారు.

పోటెత్తిన ఓటు సునామీ

- పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చిన పేద, మధ్య తరగతి జనం
- అధికంగా ఓటేసిన మహిళలు
- పింఛన్ దారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల మద్దతు అధికార పార్టీకే
- ఫ్యాను గుర్తుపై గంపగుత్తగా ఓట్లు
- వైఎస్సార్ సీపీ ప్రభంజనం స్పష్టంగా కనిపించిందంటున్న పరిశీలకులు



బాపట్ల బేతనీకాలనీ పోలింగ్ బూత్ వద్ద బారులుతీరిన ఓటర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఓటు సునామీని తలపించింది. వృద్ధులు, యువత, మధ్యవయస్సు, మహిళలు, దివ్యాంగులు పెద్దఎత్తున తరలివచ్చి ఓటుహక్కును వినియోగించుకోవడంతో జిల్లావ్యాప్తంగా 82.32 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా అద్దంకి నియోజకవర్గంలో 86.75 శాతం నమోదు కాగా ఆ తర్వాత వేమూరులో 85.02 ,చీరాలలో 83. 32, పర్చూరులో 80.5, బాపట్లలో 80, రేపల్లెలో 78. 16 శాతం చొప్పున ఓటింగ్ నమోదైంది. గతంలో ఎప్పుడూ ఇంత పోలింగ్ నమోదైన సందర్భాలు లేవు. జిల్లా వ్యాప్తంగాఅన్ని నియోజకవర్గాల పరిధిలో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మహిళా ఓటింగ్ అధికం..

ఓటు వేయాలన్న ఏకైక లక్ష్యంతో ఓటర్లు ఉదయం ఆరు గంటలనుంచే పోలింగ్ బూతులకు తరలివచ్చారు. కొన్ని బూతుల్లో ఓటర్లు ఐదు నుంచి ఆరు గంటలపాటు క్యూలైన్లలో నిల్చొని ఓటు వేయడం కనిపించింది. అన్నివర్గాల వారు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా పింఛన్ దారులు, దివ్యాంగులు, వృద్ధులు, యువత, రైతులు, ప్రధానంగా మహిళలు పెద్దఎత్తున ఓట్లు వేయడం గమనార్హం. మహిళలు ఏకంగా ఉదయం నుంచే క్యూలైన్లలో ఉండి ఓటు వేశారు. పురుషులకంటే మహిళలే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వృద్ధులు సైతం గంటల తరబడి వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎప్పుడూ ఓటర్లు ఇంతస్థాయిలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేసిన దాఖలాలు లేవని పోలింగ్ అధికారులతో పాటు అటు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అన్నివర్గాల ఓటర్లు పోటీపడి ఓట్లేసినట్లు పోలింగ్ తీరును పరిశీలిస్తే అర్థమవుతుంది. వెల్లు వెత్తిన ఓటింగ్ అధికారపార్టీకి అనుకూలంగా పడినట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చసాగుతోంది.

అధికార పార్టీ ధీమా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లపాటు పేద, మధ్య తరగతి ప్రజలకు పింఛన్లు మొదలు అమ్మఒడి, ఆసరా, సున్నా వడ్డీ రుణాలు, మత్స్యకార భరోసాతో పాటు రైతు భరోసా, ఉచిత పంటల బీమా ప్రీమియం, ఇన్స్యూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించింది. కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా అర్హులైన అందరికీ అన్ని పథకాలు అందజేసింది. దీంతో ఓటర్లు గంపగుత్తగా ఫ్యానుకు ఓట్లేసినట్లు పోలింగ్ సరళి చెబుతోందన్నది అందరి అభిప్రాయం. ఒకరకంగా పేద, మధ్య తరగతి వర్గాలు కసితో అధికారపార్టీకి ఓట్లేసినట్లు కనపడుతోంది. మరోవైపు కూటమి పార్టీలను సమర్థించిన కొన్ని వర్గాలు ఆ పార్టీ అభ్యర్థులకు ఓట్లేసేందుకు పెద్దఎత్తున తరలి వచ్చిన నేపథ్యంలో ఇటు అధికార పార్టీకి మద్దతుగా నిలిచిన పేద, మధ్య తరగతి వర్గాల ఓటర్లు పోటీ పడి మరీ ఓట్లేశారు. కూటమి ఓట్లతో పోలిస్తే అధికారపార్టీకి పడిన ఓట్లు రెండింతలు ఎక్కు ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతో పాటు బాపట్ల పార్లమెంట్ స్థానంలోనూ అధికారపార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఏ ఇద్దరు కలిసినా ఇదే చర్చ...

ఏ ఇద్దరు గుమిగూడినా ఓట్ల చర్చే సాగుతోంది. ఓటర్లు సునామీలా ఓట్లేయడంపై చర్చ జరుగుతోంది. ఇరు పార్టీల మద్దతు దారులు పోటీలు పడి ఓట్ల వేసేందుకు తరలి రావడంపై మరింత చర్చ సాగుతోంది. అన్నిరకాల పథకాలతో ఆర్థికంగా పురోగతి సాధించిన పేద, మధ్యతరగతి వర్గాలు అధికారపార్టీ అభ్యర్థులకే మద్దతుగా నిలిచి ఓట్లేశారని జనం వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. మహిళా ఓటింగ్ అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందని కూటమి మద్దతు దారులు ఆందోళన చెందుతున్నారు. ఖచ్చితంగా కూటమి అభ్యర్థుల విజయంపై ధీమా వ్యక్తం చేయలేని పరిస్థితిలో వారున్నారు. అధికారపార్టీ అభ్యర్థులకు ప్రజలు ఏకపక్షంగా ఓట్లేసినట్లు వెల్లడి కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొంది.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె రూరల్: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవమారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం తథ్యమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. రేపల్లె పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లెలు, పట్టణాలలో సైతం మహిళలు, ముఖ్యంగా వృద్ధులు అధిక సంఖ్యలో ఓటింగ్ వేసేందుకు తరలిరావటం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందటం ఇంటింటికే పెన్షన్‌లు అందించటంతో మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఎండను సైతం లెక్కచేయక మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు. అధిక సంఖ్యలో నమోదవుతున్న ఓటింగ్ సరళితో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి అభ్యర్థులు తమ ఓటమిని ముందే అంగీకరించి దాడులకు తెగబడ్డారన్నారు. పోలింగ్ సరళి శాంతియుతంగా జరగాలని, రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సహనంతో నడుచుకుని సఫలీకృతులయ్యారన్నారు.

భయంతోనే అనగాని దాడులు..

ప్రశాంతమైన రేపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ అలజడులు సృష్టించడానికి పాల్పడటం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఓటింగ్ సరళితో ఓటమి తప్పదని భావించిన సత్యప్రసాద్ పోలింగ్‌రోజు ఉదయం 11 గంటల నుంచే వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారన్నారు. పట్టణంలోని అయోవా గాల్స్ హైస్కూలు, లాల్‌బహదూర్ స్కూలు, ప్రకాశం స్కూలు పోలింగ్ కేంద్రాల వద్ద పలుమార్లు సత్యప్రసాద్ రౌడీమూకలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డాయన్నారు. సాక్షాత్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రసాద్ వీధి రౌడీలా ప్రవర్తిస్తూ వైఎస్సార్ సీపీ దళిత సంఘ యువనాయకుడు చిత్రాల ఓబేదు, బీసీ సంఘ యువ నాయకుడు ఆళ్ల రాజీపాల్‌యాదవ్‌లపై దాడులకు తెగబడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గద్దం రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్, నాయకులు పందరబోయిన బసవపున్నయ్య, గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, రేపల్లె అంజయ్య, బేతపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌లో అద్దంకి మొదటిస్థానం

86.75 శాతంగా నమోదు

అద్దంకి: సార్వత్రిక ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గం జిల్లాలోనే మిగిలిన నియోజకవర్గాల కన్నా అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉండగా, ఐదు మండలాల్లో 2,8,320 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 86.75 శాతం పోలింగ్ నమోదైంది. అద్దంకి అర్బన్‌లో 83.65 శాతం, అద్దంకి రూరల్‌లో 89.61 శాతం, సంతమాగులూరులో 85. 71 శాతం, బల్లికురవలో 86.50 శాతం, జె.పంగులూరులో 87.93 శాతం, కొరిశపాడులో 86.67 శాతంగా నమోదైంది.

వైఎస్సార్ సీపీ గెలుపు ధీమా..

ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఓటర్లు అత్యధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ స్టేషన్లు ఉదయం నుంచే ఓటర్ల క్యూలైన్లతో కిటకిటలాడాయి. ఇది తమ పార్టీకి అనుకూలమేనని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమం మళ్లీ కావాలని కోరుకుని ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ స్టేషన్లకు తరలివచ్చారని వైఎస్సార్ సీపీ నేతలు చెప్తున్నారు. అద్దంకిలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ దళిత కార్యకర్తపై హత్యాయత్నం

- దారి కాచి మరీ కత్తితో దాడి చేసిన టీడీపీ నేత
- చీరాల–స్వర్ణ దండుబాట రోడ్డులో టపాసుల గోదాము వద్ద ఘటన
- మరో వ్యక్తికీ గాయాలు
- ఎన్నికలు ముగిసినా ఆగని టీడీపీ నాయకుల దాడులు



కత్తి దాడిలో శ్రీనివాసరావు తలకు అయిన గాయం



శ్రీనివాసరావు వీపుపై గాయాలు

కారంచేడు: ఓడిపోతున్నామనే అక్కసు ఒక పక్క.. గ్రామాల్లో విలువ లేకుండా పోతుందనే బాధ మరో పక్క టీడీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దీంతో విచక్షణను కోల్పోయి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. మండలంలోని రంగప్ప నాయుడువారిపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నరేంద్ర శ్రీనివాసరావుపై అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన టీడీపీ నేత మాలెంపాటి సాయికృష్ణ మంగళవారం చీరాల–స్వర్ణ గ్రామాల మధ్య దండుబాట రోడ్డులో టపాసుల గోదాము వద్ద దారి కాచి కత్తితో హత్యాయత్నం చేశాడు. సోమవారం గ్రామంలో జరిగిన పోలింగ్ సమయంలో గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్యన వాదనలు జరిగాయి. దీనిని మనసులో పెట్టుకున్న సాయికృష్ణ శ్రీనివాసరావుపై కోపం పెంచుకున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం గ్రామ సర్పంచ్ కొర్రపాటి అనీల్ ఆధ్వర్యంలో అభ్యర్థి యడం బాలాజీని కలసి పరిస్థితులను వివరించేందుకు వచ్చి, అనంతరం అదే గ్రామానికి చెందిన మాలెంపాటి కృష్ణారావుతో కలిసి శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై రంగప్పనాయుడువారిపాలెం గ్రామానికి వెళ్లేందుకు స్వర్ణ రోడ్డులో వెళ్తున్నారు. ఈ క్రమంలో సాయికృష్ణ ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి శ్రీనివాసరావు బైకును ఢీకొట్టాడు. దీంతో కింద పడిపోయిన శ్రీనివాసరావుపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో శ్రీనివాసరావుకు తలపై ముందు భాగం నుదిటిపైన, తల వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కత్తితో వీపుపైన కూడా సుమారు పదిసార్లకు పైగా దాడి చేశాడని ప్రత్యక్ష సాక్షి కృష్ణారావు చెప్తున్నాడు. కింద పడిన సమయంలో తనకు కూడా గాయాలయ్యాయని, తాను వృద్ధాప్యంలో ఉండటంతో ఎదురు తిరగలేక పోయానని చెప్తున్నాడు. బాధితులను వెంటనే చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఔట్ పోస్టు పోలీసుల సమాచారంతో కారంచేడు ఎస్ఐ కె.సురేష్ ఫిర్యాదు స్వీకరించారు.

పేట్రేగిన పచ్చమూకలు

- వైఎస్సార్ సీపీ జడ్పీటీసీ కారు తగలబెట్టిన వైనం
- ఏడు ద్విచక్రవాహనాలు ధ్వంసం
- పోలింగ్‌బూత్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు



మంటల్లో కాలిపోతున్న బాపట్ల మండల జడ్పీటీసీ సభ్యురాలి కారు



దాడిలో తీవ్రంగా గాయపడిన గంగుల వెంకటశివకృష్ణ

బాపట్లటౌన్: పచ్చనేతలు బరి తెగించారు... అధికార పార్టీకు అనుకూలంగా ఉన్న ఓటింగ్‌ను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబట్టారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలంలోని పడమర పిన్నిబోయినవారిపాలెం 118, 119 పోలింగ్ బూత్‌ల్లో అటు సార్వత్రిక ఎన్నికలైనా.. ఇటు స్థానిక సంస్థల ఎన్నికలైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే మెజార్టీ వస్తుంది. ఈక్రమంలో ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను అడ్డుకునేందుకు టీడీపీ నేతలు సోమవారం మధ్యాహ్నం కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు ఇరు వర్గాలను చెదరకొట్టారు. పోలింగ్‌ను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నం వికటించడంతో దాన్ని మనసులో పెట్టుకున్న పచ్చపార్టీ కార్యకర్తలు సాయంత్రం మరోమారు స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద 10 మంది వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ఉన్నట్లు సమాచారం తెలుసుకొని ఒక్కసారిగా 50 మందితో కలిసి వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గంగుల వెంకటశివకృష్ణ తల పగిలి రక్తమడుగులో పడిపోగా, వల్లు గోపి, కొమ్మనబోయిన శివనాగరాజులకు గాయాలయ్యాయి. దీంతో ప్రాణభయంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పరుగులు పెట్టారు. ఆగ్రహంతో ఊగిపోయిన పచ్చపార్టీ కార్యకర్తలు వాటర్‌ట్యాంక్ సమీపంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు చెందిన ఏడు ద్విచక్ర వాహనాలు, జడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేర్‌రాణికి చెందిన కారును ధ్వంసం చేశా రు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో కారుకు పెట్రోలు పోసి నిప్పంటించారు.

కేసు నమోదు...

ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో అల్లర్లు సృష్టించడమే కాకుండా హింసాత్మక ఘటనలకు పాల్పడిన టీడీపీ నేతలపై జడ్పీటీసీ భర్త పిన్నిబోయిన సుందర్‌సింగ్ మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదులో పడమర పిన్నిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గవిని శ్రీకాంత్, గొర్ల వేణు, నక్కల యోహాను, నర్రా గోపి, నర్రా ఆదినారాయణ, ముప్పా భవాని, పందరబోయిన ఉషారాణి, మద్దిబోయిన బసవరాజ్యంలపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేమవరంలో పరస్పర ఫిర్యాదులు

20 మందిపై కేసు నమోదు

బల్లికురవ: ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగిన వివాదం చిలికి చిలికి గాలి వానలా ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఒకరికొకరు పరస్పరం మంగళవారం పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. మండలంలోని వేమవరం గ్రామంలోని సుగాలి తండాకు చెందిన భుక్యా దేవిభాయి, మూఢావత్ హరికృష్ణ నాయక్ మరో 8 మందిపై, మూఢా నాగాభాయి, భూక్యా సాంబానాయక్, మరో పది మందిపై ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదులకు సంబంధించి బల్లికురవ పోలిస్ స్టేషన్ ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు కేసులు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- మొండెం నుంచి తలను వేరు చేసి తీసుకెళ్లిన హంతకులు
- రేపల్లె 18వ వార్డులో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ నజీర్‌బేగ్

రేపల్లె రూరల్: రౌడీషీటర్ దారుణంగా హత్యకు గురైన సంఘటన రేపల్లె పట్టణం 18వ వార్డు జగనన్న కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. డీఎస్పీ మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గుడ్డికాయలంక గ్రామానికి చెందిన రౌడీషీటర్ యరగళ్ల సుబ్బారావు(48), జగనన్న కాలనీలో నివాసం ఉండే విశ్వనాథపల్లి ప్రసాద్ అలియాస్ మొండేలు ప్రసాద్, నగరం మండలం ఉల్లిపాలెంకు చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉండే బడుగు ఆదర్శ్, గతంలో మాచర్లలో హత్యకు గురైన ప్రేమ్‌చంద్ కుమారుడు మరికొంత మంది కలిసి గత పదిరోజులగా తరచూ జగనన్న కాలనీ సమీపంలో మద్యం సేవిస్తూ ఉండేవారన్నారు. మంగళవారం యథావిధిగా మద్యం తాగిన అనంతరం, ప్రసాద్, ఆదర్శ్, మరికొంత మంది సుబ్బారావుపై కత్తులతో దాడికి తెగబడ్డారన్నారు. అక్కడే ఉన్న గుడ్డికాయలంక గ్రామానికి చెందిన యరగళ్ల గోపి అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై దాడికి ఎగబడటంతో గోపి తప్పించుకుని పరారయ్యాడన్నారు. దీంతో ఆదర్శ్, ప్రసాద్‌లు సుబ్బారావును అతికిరాతకంగా చంపి మొండెం నుంచి తలను వేరుచేసి తమ వెంట తీసుకెళ్లారన్నారు. సుబ్బారావును హత్య చేసి తల తీసుకెళ్లటంతో పాటు అతని మర్మాంగాలను కోసే ప్రయత్నం చేశారన్నారు. సంఘటనా స్థలం నుంచి పరారైన యరగళ్ల గోపి కొంతసేపటి తరువాత బంధువులు, స్నేహితులను కలుపుకొని సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుబ్బారావు హత్యగావించబడి ఉన్నాడన్నారు. అయితే మృతుడు సుబ్బారావు గతంలో రెండు హత్య కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని తెలిపారు. రేపల్లెకు చెందిన ప్రేమ్‌కుమార్ గతంలో మాచర్లలో నివాసం ఉంటున్న సమయంలో ప్రేమ్‌కుమార్‌ను హత్య చేసిన కేసులో సుబ్బారావు ప్రధాన నిందితుడుగా ఉన్నాడని తెలిపారు. మృతుడు సుబ్బారావు భార్య శివపార్వతి పల్నాడు జిల్లా ఈపూరు మండలం కూచినపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తోందన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారని పేర్కొన్నారు. మృతుని భార్య శివపార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నజీర్‌బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు

ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తొలుత నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందిని, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులను, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఈవీఎం బాక్స్‌లను, ఎన్నికల సామగ్రిని, పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులను సాయుధ బలగాల ఎస్కార్ట్‌తో బాపట్ల పట్టణంలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేర్చడం జరిగిందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కేంద్ర సాయుధ బలగాలు, తమిళనాడు పోలీసులు అందరూ సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ నిష్పక్షపాతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించడం వలన జిల్లాలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. జిల్లాలో కొన్ని ప్రదేశాల్లో వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయని, ఆ ప్రదేశాల్లో పికెట్స్ ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత



స్ట్రాంగ్ రూమ్‌లకు సీలు వేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఈవీఎంలు భద్ర పరిచిన స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లాఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు–2024 పోలింగ్ ముగియడంతో ఈవీఎంలను అధికారులు స్ట్రాంగ్ రూములకు తరలించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు ఈవీఎంలు సోమవారం రాత్రికి వచ్చాయి. పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, ఖాజాన్ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో వాటిని పరిశీలించి స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన అనంతరం మంగళవారం వాటికి సీల్ వేశారు. ఓట్ల లెక్కింపు వరకు పటిష్ట భద్రత కల్పిస్తామని ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆరు నియోజకవర్గాల ఆర్‌ఓలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళకు రెండోసారి ఓటు ఇవ్వడంపై వివరణ

పర్చూరు (చినగంజాం): పోలింగ్ ఆఫీసర్‌గా తాను చేసిన పొరపాటును మన్నించాలంటూ పర్చూరు రిటర్నింగ్ అధికారి జి.రవీందర్‌కు ఓ ఉద్యోగి విన్నవించుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే మార్టూరులోని మద్దినేని సత్యనారాయణ హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్ నంబర్ 14లో పోలింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డీఎం నాగరాజు అనే ఉద్యోగి మంగళవారం పర్చూరు రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం ద్వారా విన్నవించుకున్నాడు. 13వ తేదీన పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ మహిళా ఓటరు తన గుర్తింపు కార్డుతో మధ్యాహ్నం 12 గంటలకు ఓటు వేసేందుకు వచ్చారు. ఆ సమయంలో ఓపీఓ పార్లమెంట్, అసెంబ్లీకి రెండు స్లిప్‌లు ఇచ్చారు. ఆమె పార్లమెంట్ స్లిప్ ఉపయోగించుకొని, అసెంబ్లీ ఓటు వేయకుండా వెళ్లిపోయింది. ఆమె మళ్లీ సాయంత్రం 7 గంటల సమయంలో వచ్చి అసెంబ్లీ ఓటు అడుగ్గా ఓపీఓ ఓటు ఇచ్చారు. ఓటర్లు బాగా రద్దీగా ఉన్నందువలన నిబంధనలకు విరుద్ధంగా ఓటు ఇచ్చామని, అనుకోకుండా పొరపాటు జరిగిందంటూ నాగరాజు ఆర్‌ఓకు వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 'విజ్ఞాన్' ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో ఎల్‌ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పరీక్షలు రాసిన 126 మందీ ఉత్తీర్ణులయ్యారని, నూరుశాతం ఫలితాలు సాధించామని వెల్లడించారు. గుర్రం అమర్‌నాథ్ 500 మార్కులకు 473, శ్రియా రాథోడ్ 462, ఎండీ అర్షద్ అహ్మద్ 458, ఎం.హరీష్ 443 మార్కులు సాధించారని, 20 మంది 400కు పైగా మార్కులతో సత్తా చాటారని వివరించారు.

కారెంపూడిలో టీడీపీ రౌడీ మూకల బీభత్సం



కారెంపూడిలో పహారా కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు



దాడులు చేస్తున్న టీడీపీ అల్లరి మూకలు

కారెంపూడి: కారెంపూడిలో టీడీపీ గూండాలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బీభత్సం సృష్టించారు. టీడీపీ నాయకులు రౌడీ మూకలను రప్పించి కారెంపూడిలో అల్లకల్లోలం సృష్టించారు. సుమారు 500 మంది రౌడీలు స్థానిక టీడీపీ నాయకుల నాయకత్వంలో బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు. కర్రలు, రాడ్‌లతో భయానక వాతావరణం సృష్టిస్తూ గ్రామం మొత్తాన్ని భయాందోళనలకు గురి చేశారు. ప్రజలు తలుపులు వేసుకుని తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారు మరింత రెచ్చిపోతూ కనపడిన వారినల్లా కొడుతూ భయకంపితులను చేశారు. స్థానిక కొట్ల బజారులో వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి చీతిరాల వెంకటకోటేశ్వరరావు నివాసంపై దాడి చేశారు. రాళ్లు వేస్తూ ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాలకేంద్రాన్ని ధ్వంసం చేసి తగలబెట్టారు. తర్వాత మాచర్ల రోడ్డులో ఉన్న పోలిరెడ్డికి చెందిన టీ స్టాల్‌పై దాడి చేసి ధ్వంసం చేశారు. అరుపులు, కేకలతో లూథరన్ చర్చి వద్ద ఎస్సీ కాలనీ మొత్తం అరుపులు కేకలతో బీభత్సం సృష్టించారు. తర్వాత వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి చొరబడి కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. తర్వాత జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు. అక్కడ నుంచి స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో ఉన్న ఎంపీటీసీ వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్‌టెన్సీపై దాడి చేశారు. అక్కడ ఉన్న 40 బైక్‌లకు నిప్పు పెట్టారు. బైక్‌లకు ఉన్న బ్యాటరీలు పేలడంతో దానికి ఆనుకుని ఉన్న నివాసప్రాంత ప్రజలు తీవ్రభయాందోళనలకు గురయ్యారు. తర్వాత ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న అపార్టమెంట్‌లో నిలపి ఉంచిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు. అరుపులు, కేకలతో టీడీపీ గూండాలు అరాచకం సృష్టించారు. మరో బ్యాచ్ ఆర్యవైశ్య వీధి ముస్లిమ్ ఏరియాలో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. తర్వాత గ్రామ శివారులో ఉన్న ఆదినారాయణ కాలనీకి చేరుకున్న టీడీపీ కిరాయి గుండాలు అక్కడ ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు. అందరిని భయకంపితులను చేశారు. అక్కడ కూడా చంపేస్తాం నా కొడకల్లారా అంటూ బీభత్సం సృష్టించారు. ఎంత మంది సీఆర్‌పీఎఫ్ పోలీస్ బలగాలున్నా పరిస్థితి అదుపులోకి రాలేదు. రాత్రి జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కారెంపూడిని టీడీపీ గుండాలు వణికించారు. గుండాలు కారెంపూడి మీద పడడం ఏమిటని ప్రజల్లో అలజడి ప్రారంభం కావడంతో అప్పుడే గ్రామ ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధమయ్యే పరిస్థితులో జిల్లా ఎస్పీ రాకతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయితే ఇంత చేస్తున్నా టీడీపీ గుండాలను ఎవరూ కూడా నిలువరించ లేకపోయారు. ఇదిలా ఉంటే మధ్యాహ్నం జరిగిన గుర్తు తెలియని వ్యక్తుల రాళ్ల దాడిలో కారెంపూడి సీఐ నారాయణస్వామి తలకు బలమైన గాయమైంది. జెడ్పీ హైస్కూల్ వద్ద పార్క్ చేసి ఉన్న టీడీపీ నాయకుని స్కార్పియోను దుండగులు ధ్వంసం చేశారు.

కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర అని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ అన్నారు. మధ్యవర్తిత్వంపై మంగళవారం బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు, ప్రొఫెసర్స్, ఎన్‌జీవోలు, న్యాయవాదులు మధ్యవర్తిత్వంగా వ్యవహరించేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు మండల న్యాయ సేవాధికార సంస్థలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. న్యాయస్థానంలో కేసుల పరిష్కారంలో మధ్యవర్తులది కీలక పాత్ర అన్నారు. మధ్యవర్తిగా ఎంపికైన సభ్యులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆశీర్వాదం పాల్, మధుస్వామి, టి.ప్రవల్లిక, న్యాయవాద సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే దాడులు

- రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ దాడులు
- కార్యకర్తలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు అనుకున్న విధంగానే ప్రజలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడటం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలను టార్గెట్ చేసుకుని దారుణంగా గ్రామాల్లో దాడులు చేయడాన్ని ఎమ్మెల్యే బొల్లా తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ నూజెండ్ల మండలం రెడ్డి కత్తూరు గ్రామంలో జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య రెడ్డి సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్న బూత్‌లో పోలింగ్ ఆపాలని పక్క గ్రామాలైన చెరుకుంపాలెం, జెడ్డావారిపాలెం, గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తన అనుచరులతో గ్రామస్తులపై దాడులు చేయడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి టీడీపీలో చేరి తనకు ఓట్లు వేసిన వారిపైనే దాడులు చేయడం నీచ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు జీ.వీ, మక్కెన ఆదేశాల మేరకే దాడులు

ప్రశాంతంగా ఉన్న వినుకొండ నియోజకవర్గంలో దాడులు చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి రాజకీయ లబ్ధి కోసమే దాడులకు కుట్ర చేశారని బొల్లా ఆరోపించారు. నూజెండ్ల మండలం జంగాలపల్లి, బొల్లాపల్లి మండలంలోని గ్రామాల్లో కూడా మాజీ ఎమ్మెల్యేలు దాడులను ప్రేరేపించారని విమర్శించారు. వారి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అమాయకులైన ప్రజలను పావులుగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వారి కుట్రలకు బలికావద్దని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటామని వారి దాడులకు భయపడేది లేదని కార్యకర్తల తరఫున న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. ఇదిలా ఉంటే పల్నాడు జిల్లావ్యాప్తంగా పోలీసులు కూడా ఒకే వైపు కొమ్ముకాశారన్నారు. దాడులు జరుగుతున్నా ప్రేక్షక పాత్ర వహించడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల జరిగిన తరువాత రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారని ఇకనైనా గొడవలు ఆపాలన్నారు. ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు కర్రలు పట్టుకుని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని, శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో ఎస్సీలపై దాడులు చేవారని అన్నీ ఆధారాలు ఉన్నాయని చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకునే విధంగా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, టీసీ నాయకులు సునీల్ యాదవ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాన్ని సమర్థంగా ఎదుర్కొంటాం

నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి



జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నాయకుల అరాచకాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపుఇచ్చారు. సోమవారం పోలింగ్ జరుగుతుండగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి గృహంపై టీడీపీ వర్గీయులు దాడిచేయటంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణం నుంచి వందలాది మంది కార్యకర్తలు సోమవారం రాత్రికి ఎమ్మెల్యే గృహం వద్దకు భారీగా చేరుకున్నారు. ఈ సమయంలో మళ్లీ మరోసారి ఎమ్మెల్యే గృహంపై దాడిచేయాలనే ఆలోచనతో అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన కార్యకర్తలను పిలిపించుకున్నాడనే సమాచారంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ కూడా అక్కడకు చేరుకున్నారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ సంఘటనా స్థలానికి చేరుకొని నాయకులతో చర్చలు జరిపారు. ఇరువర్గాలను శాంతించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వటంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శాంతించారు. వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ జరిగిన దానికి తగిన సమాధానం తప్పకుండా చెబుతామని అప్పటివరకు శ్రేణులు శాంతించాలని కోరారు.

మాచర్లలో ఆగని దాడులు



దగ్ధం అవుతున్న వైఎస్సార్ సీపీ నాయకుని బైక్ కన్సల్‌టెన్సీ



టీడీపీ గుండాలు కాల్చి వేసిన వైఎస్సార్ సీపీ నాయకుల బైక్‌లు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యకాండ ఆగలేదు. కారంపూడి మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ అరాచకశక్తుల దాడిలో గాయపడిన పలువురిని పరామర్శించేందుకు ఎమ్మెల్యే పీఆర్కేతోపాటు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లారు. వీరిని చూసిన వెంటనే కారంపూడి పట్టణ శివారులో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. దాడిలో పీఆర్కే వెంట ఉన్న కార్యకర్తలు గాయపడ్డారు. కొంత మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయంలోకి వెళ్లి కుర్చీలు, ఫర్నీచర్ ధ్వంసం చేసి, దాడికి పాల్పడిన వారి కోసం వెతకడం ప్రారంభించారు. కారంపూడి సీఐ నారాయణస్వామి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్తుతెలియని దుండగులు రాయి విసరగా సీఐ నారాయణస్వామి తలకు గాయమైంది. పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై లాఠీచార్జి చేశారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే పీఆర్కే, సోదరుడు పీవీఆర్‌లు వెనుదిరిగి మాచర్ల వెళుతున్న సమయంలో కొన్ని ప్రాంతాల్లో వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని టీడీపీ గుండాలు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై టీడీపీ గుండాలు దాడులు చేసి భయాందోళన సృష్టించారు. పీఆర్కే, పీవీఆర్‌లు పోలీసు బందోబస్తు నడుమ మాచర్ల పట్టణానికి తీసుకొచ్చి హౌస్ అరెస్టు చేశారు. గుర్తుతెలియని గూండాలు ఎమ్మెల్యే పీఆర్కే, సోదరుడు పీవీఆర్‌లపై రాళ్లు రువ్వి విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేశారు.

సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ

సంఘటన తెలుసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హుటాహుటిన చేరుకుని స్పెషల్ ఫోర్స్ సిబ్బందిని రంగంలో దింపారు. ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్‌ల ఇళ్ల ముందు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎక్కడా అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా షాపులు మూయించి ఎవ్వరిని రోడ్డుపై తిరగకుండా చర్యలు చేపట్టారు.

పీఆర్కే, పీవీఆర్ ఇళ్ల వద్ద బందోబస్తు

రెచ్చగొడుతున్న బ్రహ్మారెడ్డి

కారంపూడి మండలం బయల్దేరిన జూలకంటి బ్రహ్మారెడ్డి ఒప్పిచర్ల గ్రామం వద్ద టీడీపీ నాయకులతో మాట్లాడి రెచ్చగొట్టి మాచర్లకు తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు వారిని కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే బ్రహ్మారెడ్డి సెల్‌ఫోన్ లొకేషన్ తెలియకపోవడంతో ఆయనను అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. మాచర్ల పట్టణంలో మే 12 నుంచి 14వ తేదీ వరకు 23 కేసులు నమోదు చేశారు. 53 మంది దాడుల్లో గాయపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేత ఫ్యాక్షనిస్టు అయిన బ్రహ్మారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతోపాటు, ఆర్థికంగా బలవంతుడిని చేసి, నాలుగుసార్లు విజయం సాధించిన పీఆర్కే కుటుంబాన్ని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసి, దెబ్బతీయాలనే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో గొడవలు జరిగాయి. మాచర్ల పట్టణంలో ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ పోలీసులకు సూచనలు చేస్తున్నారు.

బడుగులపై దాడులా!



బాధిత మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

టీడీపీ నేతలకు సిగ్గుండాలి

- ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది
- దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- గురజాల ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్


మాచవరం: వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే అక్కసుతో బడుగు, బలహీన వర్గాలపై దాడులు చేయడం సిగ్గుచేటని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మాచవరం మండలం కొత్త గణేశునిపాడు గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ పచ్చమూకలు దాడి చేసిన నేపథ్యంలో గంగమ్మ గుడిలో తల దాచుకున్న బాధిత మహిళలను మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అనుకూలంగా ఉన్నామనే అక్కసుతో తమ ఇళ్లపై దాడులు చేసి, మగవారిని కొట్టి తరిమి వేశారని, అంతేకాకుండా తమ ఇళ్లను ధ్వంసం చేశారని, ఆటోలను, బైకులను, ఇళ్లలోని వస్తువులను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారని బాధిత మహిళలు వాపోయారు. చంపుతారనే భయంతో గంగమ్మ గుడిలో తలదాచుకున్న తమపై రాళ్లు విసిరి, బూతులు తిడుతూ నానా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే నేపంలో బడుగు బలహీన వర్గాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ పచ్చ మూకలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. దాడులు జరిగిన విషయం తెలిసినా జిల్లా ఎస్పీ బిందుమాదవ్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు సిబ్బందిని పెంచాలని విన్నవించినా పెడచెవిన పెట్టారని, పోలీసుల వైఫల్యంతోనే గ్రామాల్లో దాడులు జరిగాయని అన్నారు. ఈ గ్రామానికి ప్రత్యేక బలగాలు పెంచాలని ఎస్పీకి విన్నవించినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా ఎస్పీ గ్రామాన్ని ఎందుకు సందర్శించలేదని, 24 గంటల్లో గ్రామానికి వచ్చి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ధర్నా చేపట్టి న్యాయం కోసం పోరాడతామని అన్నారు. యరపతినేని శ్రీనివాసరావు కొజ్జాలాగా ఆడవాళ్లపై దాడులు చేయించారని, దమ్ముంటే ఎన్నికల బరిలో ఉన్నా తమను ఢీకొనాలని అన్నారు. దాడులు ఆపకుంటే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవం అని చెప్పే జంగా కృష్ణమూర్తి ఘటనపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో టీడీపీ పచ్చమూకలు దాడులు జరిపిన ఇళ్లను పరిశీలించి, బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం వేటపాలెం సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం నాగార్పమ్మ గుడి రైల్వేగేటు సమీపంలో ఒక మహిళ రైలు ఢీకొని మృతి చెంది పట్టాలపై పడిఉందన్న సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, రైలు ఢీకొని ఆమె ముఖం గుర్తు పట్టలేనంతగా ఛిద్రమై ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 50 ఏళ్ల ఉంటాయన్నారు. చీరాల నుంచి ఒంగోలు వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెంది ఉంటుందని ఎస్‌ఐ అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి వివరాలు ఎవరికైనా లభించినట్లయితే జీఆర్పీ ఎస్‌ఐ 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

సంక్షేమానికి జై కొట్టిన ఓటర్లు

- మహిళా ఓటింగ్ పెరగడమే దీనికి నిదర్శనం
- తెనాలిలోనూ నా విజయం సుస్పష్టం
- పోలింగ్ రోజున జరిగిన ఘటన వెనుక కుట్ర
- త్వరలోనే ప్రజలకు అన్ని వివరాలూ బహిర్గతం చేస్తా



అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఓటర్లు జై కొట్టారని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మహిళా ఓటింగ్ పెరగడమే దీనికి నిదర్శనమని, బాధ్యతగా రాత్రి 10 గంటల వరకూ వారు క్యూలైన్లలో నిలబడి ఫ్యాన్ గుర్తు బటన్ నొక్కారని వివరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మహిళా ఓటర్లు సునామీలా తరలివచ్చారని వివరించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని వారు బలంగా ఆకాంక్షించారని చెప్పారు. వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు తమ వెంటే ఉన్నారని, నియోజకవర్గంలో తన గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. అత్యధిక మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ రోజు ఘటన వెనుక కుట్ర ..

పోలింగ్ రోజున అయితానగర్ పోలింగ్‌బూత్‌లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, దీనివెనుక కుట్ర, కుతంత్రం ఉన్నాయని శివకుమార్ ఆరోపించారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారనేది త్వరలోనే బహిర్గతం చేస్తానని స్పష్టంచేశారు. ఎన్నికల సాకుతో ఎవరెవరో ఎక్కడి నుంచో వచ్చి, ఇక్కడ ఏ పనులు చేశారనేది త్వరలోనే తెలుస్తుందన్నారు. పోలింగ్ రోజు ఘటనపై కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాటలను ప్రస్తావిస్తూ, 'నువ్వు క్యూలైనులో నిలబడి ఓటు వేశావా మనోహర్' అని ప్రశ్నించారు. 'మీ నాన్న ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిస్తే, నువ్వు పవన్‌కళ్యాణ్‌కు వెన్నుపోటు పొడిచింది నిజంకాదా?' అని ప్రశ్నించారు. శాసనసభ్యుడిగా గత ఐదేళ్లలో నా నడక, నడత తెలిసిన ఎందరో తనను ఫోన్‌లోనూ స్వయంగానూ పలకరించారని, 'నీ వెనుక మేం ఉన్నామని ధైర్యం చెప్పారని శివకుమార్ చెప్పారు.

పవర్‌లిఫ్టింగ్‌లో 'సువర్ణా'ధ్యాయం

- ఒకే టోర్నీలో నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్న ఇద్దరు క్రీడాకారులు
- షేక్ ఆసియా, భరత్ కుమార్ అరుదైన రికార్డు
- క్రీడాభిమానుల అభినందనల వెల్లువ



పతకాలు సాధించిన భరత్ కుమార్, షేక్ ఆసియా

మంగళగిరి: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచే అరుదైన రికార్డును ఆ ఇద్దరు క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. ఒకే టోర్నీలో నాలుగేసి బంగారు పతకాలు సాధించి సత్తాచాటారు. ఈ విషయాన్ని పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కొమ్మకుల విజయ భాస్కరరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి షేక్ సంధానితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 5 నుంచి 11 వరకు హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్శిటీ పోటీల్లో డాక్టర్ షేక్ ఆసియా, పి భరత్ కుమార్ పాల్గొన్నారు. ఆసియా 69 కేజీల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించారు. మంగళగిరికి చెందిన పి భరత్‌కుమార్ 59 కేజీల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. వీరిద్దరినీ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యానారాయణ,ప్రతినిధులు గంటా వెంకటేశ్వరరావు, సకల కోటేశ్వరరావు, ఆర్ఎన్ వంశీకృష్ణ తదితరులు మంగళవారం అభినందించారు.